క్లుప్తంగా

మండల కో ఆప్షన్ సభ్యుడికి పరామర్శ



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న మంత్రి అప్పలరాజు, ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కోన పాపపేటకు చెందిన మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతూ కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా శనివారం మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అతడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శ్రీనివాసరావుకు మంత్రి, ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ డివిజన్ సభ్యుడు బండి దావీదు, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ధర్నా

పెద్దాపురం: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు నిరసనగా మండలంలోని పులిమేరు గ్రామంలో శనివారం రైతుకూలీ సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ముక్తాబత్తుల నాగమణి మాట్లాడుతూ ఈ దాడులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పిఠాపురం: పిఠాపురం–గొర్స రైల్వే గేటు సమీపంలో టిడ్కో గృహాల వద్ద అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు శనివారం తెలిపారు. టిడ్కో గృహాల్లో వివిధ పనులు జరుగుతుండగా పని చేస్తున్న కార్మికుడు మృతి చెందాడు. మృతుడు ఒడిశాకు చెందిన బూహు (45)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై జగన్మోహన్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

పిఠాపురం: పేకాడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు కొత్తపేట వీధిలో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4020 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.


ప్రత్యేక అవసరాల విద్యార్థులపై మరింత శ్రద్ధ



ప్రత్యేక అవసరాల విద్యార్థులను సామర్లకోట హైస్కూల్‌లో చేరుస్తున్న ఎంఈఓలు

సామర్లకోట: ప్రత్యేక అవసరాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించినట్టు ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు. రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు భవిత పాఠశాలల్లో శిక్షణ పొందిన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరుస్తున్నట్టు తెలిపారు. ఈ చేర్పులు ఈనెల 28 వరకు కొనసాగుతుందన్నారు. ఈ మేరకు విద్యార్థులను శనివారం స్థానిక తోట గోపాల కృష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో చేర్చారు. ఐఈడీఎస్ఎస్ టీచర్లు జీవీవీ ప్రసాద్, బేబి నాగేశ్వరి, ఐఈఆర్పీలు అనిత, పద్మావతి, హెచ్ఎం టి.శ్యామ్‌సుందర్, సీఆర్పీలు పాల్గొన్నారు.

శృంగార వల్లభ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వర రావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్వామి వారికి రూ.3,08,957 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన నూతన దంపతులకు, దాతలకు ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలను అందజేశారు. సుమారు ఆరు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఈఓ తెలిపారు.

అమ్మ ఆరోగ్యమే లక్ష్యం..

- ఇంటికే పౌష్టికాహారం పంపిణీ
- వచ్చేనెల ఒకటి నుంచి పంపాలని నిర్ణయించిన జగనన్న ప్రభుత్వం
- నెలలో రెండు విడతలుగా అందజేత

సంపూర్ణ పోషణ కిట్లలో సరుకులు

రాగి పిండి	కేజీ
కందిపప్పు	కేజీ
బియ్యం	3 కేజీలు
బెల్లం	అర కేజీ
చిక్కీలు	అర కేజీ
ఎండు ఖర్జూరం	అర కేజీ
మంచి నూనె	అర కేజీ
గుడ్లు	25
పాలు	5 లీటర్లు



పెద్దాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతల ఇంటికి పౌష్టికాహారం పంపిణీపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఉష

పెద్దాపురం: మహిళల ఆర్థికాభివృద్ధితో పాటు మాతా శిశు సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడమే కాకుండా వారి సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మాతా శిశు సంరక్షణకు, స్త్రీలలో రక్తహీనత నివారణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న కిట్ల రూపంలో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పోషకాహారం అందజేస్తున్న విషయం తెలిసిందే. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న వీటిని కొందరు దూరాభారం వల్ల, రాలేని స్థితిలోనూ సంపూర్ణ పోషకాహారం అందుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి గర్భిణులు, బలింతలకు వారి ఇళ్లకే పౌష్టికాహారం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలకు ఆదేశాలు కూడా అందాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిన ఆహారం కాకుండా 'టేక్ హోం రేషన్' పేరుతో ఇంటికే పౌష్టికాహార సరుకులు అందజేయాలని నిర్ణయించింది. దీంతో గర్భిణులు, బాలింతలు సంతోషం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

2,939 మందికి సరుకులు..

పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పెద్దాపురం, అర్బన్ ప్రాజెక్టు, సామర్లకోట అర్బన్, రూరల్ ప్రాజెక్టు పరిధిలో 283 అంగన్‌వాడీ కేంద్రాలు, 6 మినీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు 1552 మంది, బాలింతలు 1387 మంది నమోదయ్యారు. వీరందరికీ ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారాన్ని పంపిణీ చేయనున్నారు. అలాగే ఆరు నెలల నుంచి 3 ఏళ్లలోపు 7,397 మంది చిన్నారులకు, మూడు నుంచి ఆరేళ్ల వరకు ఉన్న 5,033 మంది బాలలకు 'సంపూర్ణ పోషణ'లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నెలకు బాలామృతం, 30 గుడ్లు, 6 లీటర్ల పాలు అందిస్తున్నారు.

నచ్చిన వంట చేసుకోవచ్చు



ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని వండి, వడ్డించేవారు. అయితే ఒక్కోసారి ఆకలి వేయకపోవడం, వేరే ప్రాంతాలకు వెళ్లినపుడో భోజనం చేయలేని పరిస్థితి ఉండేది. పౌష్టికాహార సరుకులు ఇంటికే ఇవ్వడం వల్ల నచ్చిన వంట చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆలోచన అభినందనీయం.

– పి.దుర్గానాగలక్ష్మి, గర్భిణి, పెద్దాపురం

ఒకటో తేదీ నుంచి అమలు



అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందించే పౌష్టికాహారం ఈ నెల 15వ తేదీ నుంచి సరుకుల రూపంలో లబ్ధిదారుల ఇళ్లకే పంపిణీ చేయాలని ఉన్నతాధికారుల ఆదేశం. ప్రతి నెలా రెండు విడతలుగా వీటిని పంపిణీ చేస్తాం. మొదటి విడతలో సరుకులు, రెండో విడతలో పాలు, గుడ్లు అందజేస్తాం. సరుకుల పంపిణీపై అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం.

– జి.ఉష, సీడీపీఓ, పెద్దాపురం ప్రాజెక్టు

ఘనంగా 'పై' దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేసిన సాయి రామకృష్ణ

సామర్లకోట: గణితంలో 'పై' విలువ 22/7ను తీసుకొంటామని అందుకే జూలై 22ను ప్రపంచ వ్యాప్తంగా 'పై' సుమారు విలువ దినోత్సవంగా జరుపుతారని గణితావధాని తోటకూర సాయి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గణిత క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పై' దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలైన హారిక, వర్షిత, తనుశ్రీలకు బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయులు కె.అరుణ, డీవీ ఆర్ఎన్ వల్లి, ఎ.శ్రీవల్లి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సౌజన్య సూచించారు. వర్షాలకు నీరు నిల్వ ఉండడంతో దోమలు పెరిగిపోయి డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తాయన్నారు. దోమల వృద్ధిని నియంత్రించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ల మధ్య డ్రమ్ములు, సంపులు, ఫ్లవర్ వేజ్‌లు, రుబ్బు రోళ్లు, పూల కుండీలు, పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



నాగులాపల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు



పెద్దాపురంలో ధ్రువపత్రాన్ని అందజేస్తున్న వీసీ సాయి ప్రసాద్



జగనన్న సురక్షలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొత్తపల్లి: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీఓ అబ్రహం లింకన్ అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో సచివాలయం వద్ద శనివారం గ్రామ సర్పంచి వడిశెట్టి గౌరీ రాజేశ్వరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని లబ్ధిదారులకు అధికారులు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఉప సర్పంచ్ గుర్రాల చిరంజీవికుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి, ఎంపీటీసీ చింతపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా అన్నారు. శనివారం మండలంలోని గుడివాడ గ్రామంలో వారు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ కనపర్తి సీమదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో దరఖాస్తుదారులకు మంజూరైన ధ్రువపత్రాలను అందజేశారు. తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఈఓపీఆర్డీ మూర్తి పంచాయతీ కార్యదర్శి భారతి, కనపర్తి శ్రీను, తోట రాజు, సత్తిరెడ్డి, కనపర్తి గోపి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ తదితరులు 11వ సచివాలయం పరిధిలోని 20, 21వ వార్డుల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. వార్డు కౌన్సిలర్ గోకేడ అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీపీఓ ఉమామహేశ్వరావు, మేనేజర్ జ్యోతిరాణి, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్ళి వీర్రాఘవులు, విడదాసరి రాజా, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ పాల్గొన్నారు

కొత్తూరులో..

సామర్లకోట: మున్సిపాలిటీ 12వ సచివాలయ పరిధిలోని కొత్తూరులో శనివారం జగనన్న సురక్ష నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ పాల్గొని పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైస్ చైర్మన్ గోకిన సునేత్రదేవి, మున్సిపల్ మేనేజరు అచ్చుత రాజు, మెప్మా సిటీ మిషన్ మేనేజరు సుజాత, జగనన్న సురక్ష పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి, వార్డు ఇన్‌చార్జి పుట్టా సూరిబాబులు పాల్గొన్నారు.

హుస్సేన్‌పురంలో..

సామర్లకోట: జగనన్న సురక్షతో సమస్యలు దూరం అవుతున్నాయని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. మండల పరిధిలో శనివారం హుస్సేన్‌పురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని గ్రామంలో 109 సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ మార్ని నాగమణి, ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పరిశీలన



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్, ఆర్డీఓలు

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెంలో నిర్వహిస్తున్న ఓటర్ల సర్వేను శనివారం అసిస్టెంట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పరిశీలించారు. ఆర్డీఓ జె.సీతారామారావు ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. నియోజకవర్గంలో 200 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని ఆర్డీఓ ఆయనకు తెలిపారు. ఎస్ఎల్ఎస్ కుమారి, సర్వే డిప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, సూపర్‌వైజర్ చంద్రశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ తమ ఓటును పరిశీలించుకోవాలని తహసీల్దార్ గిడుతూరి వెంకట ప్రసాద్ సూచించారు. కొత్తపల్లిలో జరుగుతున్న ఓటర్ల సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు బీఎల్ఓలు ఇంటింటా సర్వే చేస్తారన్నారు. బీఎల్ఓలు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఒక వ్యక్తి 2, 3 చోట్ల ఓటు కలిగి ఉంటే వారి అభిప్రాయం మేరకు ఒక చోటే ఓటు ఉంచి మరోచోట తీసేయాలని సూచించారు. వీఆర్వో కామేశ్వరావు ఉన్నారు.

ఓటరు సర్వేకు సహకరించాలి

ఓటరు సర్వేకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఓటర్ సర్వేపై వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు.

మొక్కే కదా అని వదల్లేదు.. పీకేశారు..



మొక్కలు తొలగించడంతో శుభ్రంగా ఉన్న ఫ్లైఓవర్

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడల్లో పెరిగిపోతున్న రావి మొక్కలను మున్సిపల్ అధికారులు శనివారం తొలగించారు. శనివారం సాక్షి దినపత్రికలో 'మొక్కే కదా అని వదిలేస్తే'.. అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పక్షుల రెట్టల వల్ల బ్రిడ్జి గోడల పగుళ్లలో మొక్కలు వృక్షాలుగా మారి పాతున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు ఆర్అండ్‌బీ అధికారులు పర్యవేక్షించి తొలగించాల్సి ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించక పోవడంతో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు స్పందించి గోడలో పెరిగిన మొక్కలు తొలగించేలా పారిశుధ్య కార్మికులను ఆదేశించారు.

ప్రతి గడపలో ఆనందం

- ప్రజల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం



పిఠాపురంలో లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గతంలో ఏ పని జరగాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగనన్న ప్రభుత్వంలో నేరుగా వలంటీర్లే అర్జీలు పెట్టి తమకు కావాల్సిన సర్టిఫికెట్లు, పథకాలు నేరుగా ఇంటికే తెచ్చి ఇస్తున్నారంటూ పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ పాలనపై హర్షం వ్యక్తం చేశారు. పిఠాపురం 3వ వార్డులో శనివారం ఎమ్మెల్యే పెండెం దొరబాబు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి పథకాలు సక్రమంగా అందుతున్నాయా అంటూ ప్రజలను ఆరా తీశారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజలు తమకు నవరత్నాల పథకాలు అందుతున్నాయంటూ సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగులు నింప లేదని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టాక తమ తల రాతలే మారిపోయాయని ఎమ్మెల్యే వద్ద పలువురు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం వర్తించిందన్నారు. ఒక్కో ఇంట్లో నాలుగు నుంచి ఆరు పథకాల వరకూ అందుకుంటున్న లబ్ధిదారులు ఉన్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక టీడీపీ నేతలు తప్పుడు ప్రచారాలు, ఆరోపణలు చేస్తున్నారన్నారు. అనంతరం కాలనీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

పొలంబడిపై అవగాహన కల్పించండి



పొలంబడిపై వీఏఏ, వీహెచ్ఏల సమావేశంలో సూచనలిస్తున్న డీఏఓ విజయ్‌కుమార్

పెద్దాపురం: రైతులకు పొలంబడిపై పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఏఏ, వీహెచ్ఏలదేనని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల వీఏఏ, వీహెచ్‌లతో శనివారం కాండ్రకోటలో వ్యవసాయ శాఖ ఏడీఏ దైవకుమార్ అధ్యక్షతన పొలంబడి నిర్వహించారు. పొలంబడి ముఖ్యోద్దేశం, రైతులకు చేకూరే లబ్ధిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆకుముడత, దోమపోటుపై దృష్టి సారించాలన్నారు. రైతులు వరి పంటలో పాటించాల్సిన భద్రతపై అవగాహన కల్పించారు. కౌలు రైతులు విధిగా సీసీఆర్ కార్డులు కలిగి ఉండాలన్నారు. ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులందరూ ఈకేవైసీ చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఏఈఓ ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, రైతులు ఆయా గ్రామాల వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

నూరు శాతం నాట్లు పూర్తి చేయాలి

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మునిరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం

పెద్దాపురం: సార్వాలో నూరుశాతం వరినాట్లు పూర్తి అయ్యేందుకు వ్యవసాయాధికారులు కృషి చేయాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయాధికారులకు శిక్షణా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ ప్రస్తుత సార్వా వర్షాల వల్ల నాట్లు ఆలస్యంగా మొదలయ్యాయన్నారు. నెలాఖరులోగా నూరుశాతం వరినాట్లు పూర్తయ్యేలా రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ స్థితిగతులపై వివరించారు. అనంతరం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు మాధవరావు, హరి, జ్యోతిర్మయి, శాస్త్రవేత్తలు నందకిశోర్, శర్మ, సుధీర్, రమణారావు, సుజాత, అనూష తదితరులు పాల్గొన్నారు.